

# ఆస్తి - అంతస్తు

మాణిక్యం ఫోన్ చెయ్యగానే బయల్దేరాడు అడ్వకేట్ రామచంద్ర. విషయం ఏమిటని అడిగితే ఫోన్‌లో చెప్పేది కాదు అన్నాడు.

రామచంద్ర కారు ఆగగానే ఆ ఇంట్లో నౌకరు ఎల్లయ్య డోర్ తెరిచి పట్టుకుని, "అయ్యగారు మేడపైన వున్నారు. మిమ్మల్ని పైకి రమ్మన్నారు" అన్నాడు.

రామచంద్ర తలవూపి మేడపైకి వెళ్ళాడు.

"ఏంట్రా అర్జెంట్ మేటర్?" అని అడుగుతూ సోఫాలో కూర్చున్నాడు.

మాణిక్యం ఎందుకో విచారంగా కనిపించాడు. భార్య వియోగం అతన్ని కృంగ దీసింది.

"భారతి విషయం" అన్నాడు మాణిక్యం.

"మ్యారేజి విషయమా? ఏదైనా సూటబుల్ మ్యాచ్ చూశావా?" అడిగాడు రామచంద్ర.

మాణిక్యం తల అడ్డంగా వూపాడు.

నౌకరు స్నాక్స్, 'టీ' తెచ్చి టీపాయ్ మీద పెట్టి వెళ్ళాడు.

"మరేమిటి?"

"భారతి ఎవరో తన కొలీగ్‌ని ప్రేమించానని చెప్తోంది" కొంచెం కోపంగా అన్నాడు మాణిక్యం.

రామచంద్ర నవ్వాడు.

"ఈ రోజుల్లో అదొక గొప్ప విషయమా? మామూలే? అందులో భారతి ఏమైనా చిన్నపిల్లా? పోస్ట్ గ్రాడ్యుయేట్. నాలుగేళ్ళ నుంచి జాబ్ చేస్తోంది. తనకి నచ్చిన వాడిని ప్రేమించింది. తప్పేముంది? అతను ఎవరో విచారించి మ్యారేజ్ చేస్తే హ్యాపీ !" అన్నాడు.

"నాకు ఇష్టంలేదు" చెప్పాడు మాణిక్యం.

"ఏం?"

"మనకి కోట్ల ఆస్తి వుంది. ఆ కుర్రాడి తండ్రి సాధారణ వుద్యోగి. సెక్రటేరియట్లో సెక్షన్ ఆఫీసర్. మహా ఐతే నెలకి ఇరవై వేలు జీతం"

"అతని తండ్రి గురించి మనకెందుకు? అతను భారతితోపాటు జాబ్ చేస్తున్నాడుగా?"

"నీకు తెలీదురా రామూ ! ఆ కుర్రాడికి ఇద్దరు చెల్లెళ్ళు. పెళ్ళికావలసిన వాళ్ళున్నారు. మరొక తమ్ముడు చదువుకుంటున్నాడు. లోయర్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ..."

"నీకు చాదస్తంరా మాణిక్యం. ఆ కుర్రాడి ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ నీకెందుకు? కుర్ర వాడు బుద్ధిమంతుడా? కాదా? అనే విషయం చూసుకో"

"అది ఇప్పుడే ఏం తెలుస్తుంది? వాడు భారతినే ఎందుకు ప్రేమించాడు? ఇంకెవరూ దొరకలేదా?"

"అసలు నీ ఉద్దేశ్యం ఏమిట్రా?"

ఆ కుర్రాడు భారతి ఆస్తిమీద కన్నేశాడని నా నమ్మకం"

"అలాగే అనుకో. ఎటూ నీకు భారతి ఒక్కతే కూతురు. ఎటూ ఆస్తంతా నీ తదనంతరం ఆమెదే కదా !"

"హూ...నీకు అంతే తెలుసురా ! పెళ్ళయ్యాక వాళ్ళ నిజస్వరూపం తెలుస్తుంది. ఎన్ని కేసులు పేపర్లో చదవడం లేదూ ! పెళ్ళయ్యే వరకూ వుదారులుగా వుంటారు. డబ్బుదే వుంది? అంటారు. వాళ్ళు సుఖంగా కాపురం చేసుకుంటే చాలంటారు. తర్వాత అసలు రంగు బైటపడుతుంది. ఆస్తి మా వాడి పేరున రాయించుకురా ! అందాకా పుట్టింట్లో పడివుండు అని తరుముతారు" మాణిక్యం సీరియస్‌గా అన్నాడు.

రామచంద్ర తలపట్టుకు కూర్చున్నాడు. మాణిక్యం తన ధోరణిలో చెప్పుకు పోతున్నాడు. ఆ కుర్రాడు మోసగాడు. తన కూతురు అమాయకురాలు. ప్రేమ మైకంలో పడిపోయి తన మాటలు పట్టించుకోవడంలేదు. అదీ మాణిక్యం మాటల్లో సారాంశం.

"ఐతే ఇప్పుడేం చేద్దామంటావు?" అడిగాడు రామచంద్ర.

"నువ్వు లాయర్‌వి కదా? ఏదైనా ఐడియా చెప్తావని రమ్మన్నాను" అన్నాడు మాణిక్యం.

"సరే ! ఆ కుర్రాడు నీ ఆస్తి చూసి భారతిని ప్రేమించాడని నమ్ముతున్నావు కదా ! ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వనని సినిమా డైలాగులు చెప్పు"

"ఏడ్చినట్టుంది నీ ఐడియా ! ఇటువంటి బెదిరింపులకు ఈ కాలం పిల్లలు లొంగు తారనుకున్నావా? ఏదో నలుగురుంటే ఏమైనా భయపడతారేమో? నాకు భారతి ఒక్కతే గదా ! పెళ్ళయ్యాక మనసు మార్చుకుంటామనే భరోసాతో వుంటారు"

"పోనీ అట్లాగే వుండనీ. నీ తదనంతరమే ఆస్తి ఇవ్వొచ్చు"

"పెళ్ళయ్యాక మన చేతిలో ఏముంటుంది? వాళ్ళ చేతికి జుట్టు అందించినట్లే. పిల్లని బాధలు పెడితే? చూస్తూ వూరుకోలేం కదా?"

"మరేం చేద్దామంటావు?"

"నాకొక ఐడియా వచ్చింది. ఈ దెబ్బకు ఆ కుర్రాడి అసలు రంగు బైటపడుతుంది"

"ఏమిటో చెప్పు?"

"ఈ ఆస్తి తాతల నాటిది. నాకు వారసత్వంగా సంక్రమించింది. దీన్ని ఆసరా వృద్ధాశ్రమానికి రాసినట్లు విల్లు తయారుచెయ్యి. దీనిమీద భారతి సంతకం కూడా అవసరం కాబట్టి రిజిస్ట్రార్ ఆఫీసుకి పిలిపించి సంతకం పెట్టమందాం. ఆ కుర్రాడిని కూడా తీసుకు రమ్మందాం..."

"అప్పుడు భారతి అతనితో సంప్రదింపులు జరుపుతుంది. అతగాడు సంతకం పెట్టవద్దని అంటాడు. దానితో వాడి రంగు తేలుతుంది. ఆస్తిలేని నీతో ప్రేమేంటి? నీకు నాకు రామ్ రామ్ అంటాడు. అంతేగా నీ ఐడియా?" అన్నాడు రామచంద్ర.

"ఎగ్జాట్లీ" సంతోషంగా అన్నాడు మాణిక్యం.

"సరే ! డాక్యుమెంట్ల జెరాక్స్ కాపీలు పట్టుకుని ఆఫీసుకురా ! విల్లు ప్రిపేర్ చేయిస్తాను" అన్నాడు రామచంద్ర.

★ ★ ★

సబ్ రిజిస్ట్రార్ చాంబర్‌లో కూర్చుని వున్నారు మాణిక్యం, రామచంద్ర. సబ్ రిజిస్ట్రార్ విల్లు చదువుతూ కూర్చున్నాడు.

ఇంతలో ఆఫీసు బైట కారు ఆగింది. భారతి, ఆమె కొలీగ్ సుభాష్ లోపలకు వచ్చారు.

"నాన్నా ! ఏమిటి అర్జెంటుగా ఇక్కడికి రమ్మని ఫోన్ చేశావు?" అంటూ వచ్చింది భారతి.

"విల్లు రాయించానమ్మా ! రిజిష్టర్ చేయిస్తున్నాను. ఆస్తి వారసత్వంగా వచ్చింది కదా? నీ సంతకం కూడా పెట్టాలన్నారు. అందుకని రమ్మన్నాను" చెప్పాడు మాణిక్యం.

"ఓస్ అంతేనా ! నేనింకేంటో అనుకుని భయపడ్డాను. ఔనూ ! సుభాష్‌ని గూడా తీసుకురమ్మన్నా వెందుకూ?" అన్నది భారతి.

"అతను నీక్కాయే భర్త. మన కుటుంబ ఆస్తులు గురించి తెలుసుకోవడం మంచిది కదా ! రాముూ అంకుల్ విల్లు చదువుతాడు విను" అన్నాడు మాణిక్యం.

రామచంద్ర రిజిస్ట్రార్ దగ్గరున్న విల్లు డాక్యుమెంట్లు తీసుకుని చదవడం మొదలు పెట్టాడు.

"మాణిక్యానికి వంశపారంపర్యంగా వచ్చిన స్థిరాస్తులు ఆసరా వృద్ధాశ్రమం నిర్వహణకు, అభివృద్ధికిగాను బహుమతిగా ఇవ్వడానికి నిర్ణయించుకుని, ఇక నుంచి ఈ స్థిరాస్తులన్నీ ట్రస్ట్‌కి చెందుతాయని ఇష్టపూర్వకంగా రాసిస్తున్నాడు. ఐతే ఈ స్థిరాస్తి తాతల కాలం నుంచి వంశపారంపర్యంగా వచ్చింది. గనుక ఆయన ఏకైక కుమార్తె భారతి కూడా అంగీకారం తెలిపి సంతకం చేయవలసి వుంటుంది."

ఇదీ ఆ విల్లు సారాంశం.

సుభాష్ లేచి నిల్చుని మాణిక్యానికి పాదాభివందనం చేశాడు.

"అంకుల్ ! మీరు చాలా గొప్ప మనసు కలవారు. ఇతరుల ఆస్తులను ఎలా కొల్లగొట్టాలా? చౌకగా కొట్టేయాలా? అని ఎక్కువమంది ధనవంతులు అక్రమాలకు పాల్పడుతూ వుండగా ! మీరు వున్నదంతా వృద్ధాశ్రమానికి దానంగా ఇవ్వడం మహోన్నతమైన విషయం. మీరు ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు ఎదిగిపోయారు" అని మెచ్చుకున్నాడు సుభాష్.

"అంకుల్ ఎక్కడెక్కడ సంతకాలు పెట్టాలి చెప్పండి" అంటూ విల్లు కాగితాలు అందుకుని వరసగా సంతకాలు పెట్టేసింది భారతి.

ఆమె చాలా సంతోషంగా కనిపిస్తోంది.

"నాన్నా ! ఇప్పుడు మీ గురించి నాకు దిగులు లేదు" అన్నది ఆనందం వ్యక్తం చేస్తూ.

"మీ నాన్న గురించి నువ్వు దిగులుపడుతున్నావా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు రామచంద్ర.

"మా కంపెనీ మమ్మల్ని అమెరికా బ్రాంచి పంపించాలని డిసైడ్ చేసింది. ఐతే నాన్నని ఇండియాలో ఒంటరిగా వదిలేసి వెళ్ళడం ఎలాగా అని డైలమాలో పడిపోయాను. అమ్మ పోయిన తర్వాత నాన్న ఆరోగ్యం సరిగాలేదు. సుగర్, బిపి వున్నాయి. నేనున్నాను కాబట్టి సమయానికి మందులు వేసుకోమని గుర్తుచేస్తున్నాను. నేను వెళ్ళిపోతే ఎలాగా అని దిగులు కలుగుతోంది. ఇప్పుడు నాన్న ఆస్తి వృద్ధాశ్రమానికి రాసిచ్చి సంతోషంగా వున్నారు. ఆయన ఈ వయసులో అక్కడ కాలం గడపడం ఆనందంగా వుంటుంది. ఆసరా ఓల్డేజి హోమ్‌కి నిర్వహణలో మంచి పేరుంది. మేము ఒకసారి ఎల్డర్స్ డే నాడు వెళ్ళడం జరిగింది. అక్కడ వృద్ధులంతా చాలా ఆనందంగా వున్నారు. డాక్టర్స్ అందులోనే క్లినిక్ నిర్వహిస్తున్నారు. పదార్థాలు చాలా బాగున్నాయి" చెప్పుకుపోతోంది భారతి.

భారతి, సుభాష్ తన ధాతృత్వానికి అడ్డంపడతాడని వూహించిన మాణిక్యం తెల్ల ముఖం వేశాడు.

"నాన్నా ! వెళ్ళొస్తాం ! ఆఫీసులో పర్మిషన్ తీసుకుని వచ్చాం. అంకుల్ ! మీరు మా పెళ్ళికి తప్పకుండా రావాలి" రామచంద్రకి నమస్కారం పెట్టి బయల్దేరారు భారతి, సుభాష్.

"ఇప్పటితరం ఆస్తులు లెక్కపెట్టడం లేదండీ. వీళ్ళ రూటే సపరేటు" అన్నాడు సబ్ రిజిస్ట్రార్.

"భారతి పెళ్ళి తర్వాత నువ్వు ఆశ్రమంలో చేరడానికి మెంటల్‌గా ప్రిపేరవడం మంచిది" అన్నాడు రామచంద్ర నవ్వుతూ.

మాణిక్యం తన పథకం బెడిసికొట్టడంతో అయోమయంగా చూసి "అంతా దైవేచ్ఛ" అన్నాడు.

-ఆంధ్రభూమి వారపత్రిక *20-11-2008*